


జిల్లాలో ఐదుగురు సిఐల బదిలీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో పలువురు సీఐలను బదిలీలు చేస్తూ విశాఖ రేంజ్ గోపీనాథ్ శెట్టి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్‌ను విజయనగరం జిల్లా ఎస్.కోట సర్కిల్‌కు, చిన్న మేరంగి సిఐ బి.మంగరాజును శ్రీకాకుళం జిల్లా సోంపేట సర్కిల్‌కు, కోటియా సిఐ కె.నారాయణరావును విజయనగరం జిల్లా బొబ్బిలి రూరల్‌కు, సాలూరు రూరల్ సిఐ బి.బాలకృష్ణను విశాఖ విఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



తొలగింపులకు నిరసనగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

వేధింపులు తొలగింపులు

ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజకీయ నాయకులు స్థానికంగా అతి తక్కువ జీతానికి సేవలందిస్తూ పనిచేస్తున్న బడుగు ఉద్యోగులైన విఒఎలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు వంటి వారిపై వేధింపులకు పాల్పడి వారిని తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు చూపిన పక్షపాత వైఖరి, కక్షసాధింపు చర్యలు, బంధుప్రీతితో వీరు నలిగిపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో ఈ కక్ష సాధింపు మరింత ఎక్కువైంది. ఎన్నికల్లో వైసిసికి సహకరించారంటూ దిగువ స్థాయి సిబ్బందిపైనా, చిరుద్యోగులపైనా టిడిపి నాయకులు కక్ష కట్టి తొలగించేందుకు చర్యలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే తొలగించగా, మరికొన్ని చోట్ల తొలగించేందుకు జాబితాలను జిల్లా నాయకులకు, ఎమ్మెల్యేలకు అందజేస్తున్నారు.

- స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపై టిడిపి పాలకుల కక్ష సాధింపు
- జియ్యమ్మవలసలో 9 మంది విఒఎల తొలగింపు
- కొమరాడ, మక్కువ, పాచిపెంట కెజిబివిల్లో కార్మికులకు ఉద్వాసన!
- వ్యతిరేకంగా నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు సిఐటియు పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో పనిచేస్తున్న స్కీం వర్కర్లు, చిరుద్యోగులను తొలగించేందుకు టిడిపి నాయకులు చర్యలు చేపడుతున్నారు. వైసిపి హయాంలో నియమితులైన వారితో పాటు, వైసిపికి సహకరించారంటూ మరికొందరిపై కక్ష కట్టి తొలగించేందుకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిందే తడవుగా వారి దష్టి స్కీం వర్కర్లపై పడింది. వారిని తొలగించి తమ మనుషులను వేసుకోవాలనే ఆలోచన తప్ప స్కీం పథకాల కింద పని చేస్తున్న వారు పేదలు, వెనుకబడిన కులాలు వారనే ఆలోచన లేకుండా రాజకీయ కక్ష సాధింపులకు టిడిపి నాయకులు పాల్పడుతున్నారు. వివిధ పథకాల్లో పని చేస్తున్న వారికి వచ్చే వేతనాలు కేవలం గౌరవ వేతనాలు మాత్రమే. అయినా వారి పొట్టకొట్టి తొలగించాలని చూస్తున్నారు. అధికారంలోకి రాగానే జిల్లాలో పలు మండలాల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, విఒఎలు, గ్రీన్ అంబాసిడర్లు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లపై వేధింపులకు పాల్పడుతున్నారు. తమను వచ్చి కలవాలని హుకుం జారీ చేయడం, ఉద్యోగంలోకి రావద్దని హెచ్చరించడం వంటి ఘటనలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఇప్పటికే జియ్యమ్మవలస మండలంలో వెలుగు పథకం ద్వారా పని చేస్తున్న 9 మంది విఒఎలను తొలగించారు. సీతానగరం మండలంలోని ఒక విఒను విధుల్లోకి రావద్దని చెప్పారు. కొమరాడ మండలంలోని ఒక పాఠశాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులను విధులకు రావద్దని హెచ్చరించారు. జియమ్మ వలస మండలంలో జోగులడుమ్మకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ తొలగించేందుకు ఆ గ్రామ టిడిపి నాయకులు ప్రయత్నాలు ప్రారంభించి విజయం సాధించారు. అలాగే పార్వతీపురం మండలం సూడిగంలో గత వైసిపి ప్రభుత్వంలో నియమించబడిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను అవినీతి ఆరోపణలపై తొలగించి టిడిపి వారిని నియమించుకునేందుకు సన్నాహాలు ప్రారంభించారు. అలాగే కొమరాడ, పాచిపెంట, మక్కువ మండలాల్లోని కస్తూరిబా పాఠశాలల్లో దినసరి వేతనాలతో పనిచేస్తున్న కుక్‌లను, నైట్‌వాచ్‌మెన్‌లను తొలగించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అనేక ఇబ్బందులకు ఓర్చి, బిల్లులు సకాలంలో రాకపోయినా, వంట సామాన్లు ఇవ్వకపోయినా, వంటలు చేసేందుకు షెడ్‌లు లేకపోయినా సామాజిక బాధ్యతగా వంటలు చేసి కార్మికులు విద్యార్థులకు సకాలంలో భోజనం అందిస్తున్నారు. అటువంటి వారిపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు అధికార పార్టీ నాయకులు పాల్పడుతున్నారు. రోజూ రోజుకూ ఈ వేధింపులు, తొలగింపు చర్యలు తీవ్రమవ్వడంతో వీరంతా రోడ్డున పడుతున్నారు. కక్ష సాధింపు చర్యలకు, తొలగింపునకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పోరు బాటకు సిద్ధమయ్యారు. అందులో భాగంగానే సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేపట్టేందుకు సన్నద్ధమ వుతున్నారు.

కక్ష సాధింపు చర్యలు ఆపాలి



ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులు కేవలం కిందిస్థాయి ఉద్యోగులు, స్కీం పథకాల్లో పనిచేస్తున్న సిబ్బందినే లక్ష్యంగా వేధింపులకు, తొలగింపునకు పాల్పడడం సరికాదు. ప్రజలకు సేవ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వారు చిరు ఉద్యోగులు, కార్మికుల పొట్టలు కొట్టడం ఎంతవరకు న్యాయం? స్కీం వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు, విఒఎలు, కింది స్థాయి ఉద్యోగులపై వేధింపులు ఆపాలి. వీటిపై సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో స్కీం వర్కర్లంతా పాల్గొని విజయవంతం చేయాలి.

వై మన్మధరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

డోలీ మోతల నివారణకు చర్యలు

త్వరలో ట్రైకార్ రుణాల మంజూరు ● ఆదివాసీ ఉత్సవాలలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన గర్భిణులకు గానీ అనారోగ్యానికి గురైన వారికి గానీ డోలీమోతలు లేకుండా చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. ప్రపంచ ఆదివాసీ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని ఫిలిడెల్ఫియా కమ్యూనిటీ హాలులో గిరిజన సంఘాలు నిర్వహించిన సంబరాలను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గిరిజన సాంప్రదాయ థింసా నృత్యం చేస్తూ గిరిజన మహిళలతో జత కలిశారు. తర్వాత ఆదివాసీ దేవతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అన్ని గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్‌లు వెళ్లేలా రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. గిరిజనులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గిరిజన యువత ఉన్నత విద్య అభ్యసించేందుకు కృషి చేస్తామని చెప్పారు. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు శిక్షణా తరగతులు కూడా త్వరలో వైటిసిలో ప్రారంభమవుతాయని చెప్పారు. గిరిజన నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో 32 గిరిజన గ్రామాలకు రూ.3 కోట్లతో తాగునీటి పథకాలు మంజూరు చేసినట్లు చెప్పారు. మరో 70 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గిరిజనాభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌టి కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు మాట్లాడుతూ రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులు, ప్రయోజనాల



గిరిజన యువతతో కలిసి థింసా నృత్యం చేస్తున్న మంత్రి



ఉత్సవాల్లో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

కోసం ఐక్యంగా పని చేయాలని సూచించారు. ఆదివాసీల పోరాటాలతో సాధించిన ఆర్టికల్ 46, ఆర్టికల్ 29 ద్వారా గిరిజనుల ప్రయోజనాల కోసం రక్షణ కల్పించారని చెప్పారు. జీవో నెంబర్ 3 రద్దుపై గిరిజనులంతా ఐక్యంగా పోరాడాలని కోరారు. గిరిజన చట్టాలు, హక్కుల పరిరక్షణకు సంబంధించిన అనుమానాలుంటే ఎస్టీ కమిషన్‌ను సంప్రదించాలని డాక్టర్ డివిజి శంకరరావు కోరారు. నిర్వాహక కమిటీ సభ్యులు కోట లక్ష్మణరావు, డాక్టర్ మంచాల వెంకటరమణ పాల్గొన్నారు.

హాజరైన మాజీ డిప్యూటీ సిఎం

ప్రపంచ ఆదివాసీ ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో గిరిజన సంఘాలు ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర కూడా హాజరయ్యారు. నిర్వాహకులు చెప్పిన సమయానికి ఆయన హాజరై అక్కడ ఉన్న గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడి వెళ్లిపోయారు. వైద్య పరీక్షల నిమిత్తం బయటకు వెళ్తున్నందున ఉత్సవాలు ప్రారంభించే సమయానికి ఆయన పాల్గొనలేకపోయారు.

రామనగర్‌లో...

సీతంపేట : మండలంలోని ధారపాడు పంచాయతీ రామానగర్‌లో ప్రపంచ ఆదివాసీ సభ కె.పరుసరాం అధ్యక్షతన నిర్వహించారు. గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతి రావు మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. ఈ దినోత్సవ సందర్భంగా స్నేహ సంబంధాలు మరింత బలంగా బలపడతాయన్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి.సాంబయ్య, జె.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు

న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యాన నేడు ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - కురుపాం

న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో గల కురుపాం, శివన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు కోర్టు సిబ్బంది శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుండి వైద్య శిబిరంలో వైద్యులు అందుబాటులో ఉంటారని, కావున కురుపాంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరానికి వచ్చి వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.



గుమ్మిడిగెడ్డ కాలువల్లోని పూడికలు తొలగిస్తున్న రైతులు

స్వచ్ఛందంగా పూడికతీయిస్తున్న గుమ్మిడిగెడ్డ రైతులు

ప్రజాశక్తి - కురుపాం

గుమ్మిడిగెడ్డ మెయిన్ కెనాల్‌కు పూడిక తీయకపోవడంతో రైతుల పొలాలకు సక్రంగా నీరందక ఆయకట్టు రైతులంతా ఆదివారం స్వచ్ఛందంగా పూడిక తీసే కార్యక్రమం పనులు ప్రారంభించారు. కురుపాం మండలం గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్ నుంచి జియ్యమ్మవలస మండలం కన్నపుదొర వలస గ్రామాల పొలాల వరకు సుమారు మూడు వేల ఎకరాలకు నీరు అందించాల్సి ఉండగా, గత ఆరేళ్లుగా ప్రభుత్వం పూడిక తీసే కార్యక్రమం చేపట్టకపోవడంతో నీరందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది వర్షాలు పడడంతో కొంత వరకు రైతులు ఏదో విధంగా పంటలు పండించేవారు. ఈ ఏడాది సక్రమంగా వర్షాలు పడకపోవడంతో ఇప్పటి వరకు నీరు వదలకపోవడంతో రైతులు అధికారులను కలిసినా ఫలితం లేకపోయింది. దీంతో పూతికవలస, సీతంపేట, కన్నపుదొరవలస తదితరులు గ్రామాల రైతులు స్వచ్ఛందంగా డబ్బులు ఎత్తుకొని జెసిబితో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు బంటు వెంకటనాయుడు, మర్రాపు శేషు, మర్రాపు సింహచలం, పి.శ్రీను, శెట్టి శ్రీనివాసరావు, సూర్యనాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

కేరళలోని వాయినాడ్‌లో నెలకొన్న ప్రకృతి వైపరీత్యాన్ని జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలని, బాధితులు పక్షాన నిలబడి ఆ కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. పాచిపెంటలో కేరళ విపత్తులో సర్వం కోల్పోయిన కుటుంబాలకు ఆదుకోవాలని కోరుతూ ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వాయినాడ్ ఘటనను జాతీయ విపత్తుగా పరిగణించి ఉదారంగా బాధితులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ప్రజలు, సంస్థలు, ఉద్యోగులు, కార్మికులు బాధితులకు అండగా నిలిచి ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. పాచిపెంటలో విరాళాలు సందర్భంగా సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు, సుర్రు రామారావు, కొర్ర కళ్యాణ్, కొర్ర శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు కె.అర్జున్, సోను భీమ్రాజ్, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: కేరళ రాష్ట్రం వాయినాడ్ జిల్లాలో తీవ్రంగా



సీతానగరంలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు



పాచిపెంటలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

నష్టపోయిన వరద బాధితులకు సహాయార్థం సీతానగరం మండల సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరణ జరిగింది. సేకరించిన విరాళాలు రూ.5067 జిల్లా కమిటీకి అందజేశారు. జిల్లా కమిటీ సేకరించిన విరాళాలను కేరళ సిఎం సహాయ నిధికి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి లక్ష్మం నాయుడు, జి.వెంకటరమణ, వి.రామలక్ష్మి, బి.అప్పారావు, ఆర్.రాము, సిహెచ్.కృష్ణ, పి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు

కొమరాడ : వయినాడ్ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ విరాళాలివ్వాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం కొరాడలో వయినాడ్ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలు రూ.4,325 మొత్తాన్ని సిపిఎం జిల్లా కమిటీకి అందజేశామన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వాకాడ ఇందిర, రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘాల నాయకులు ఉపేంద్ర, జగన్నాథం, వెంకటేశు, బోడయ్య, సుందర్రావు పాల్గొన్నారు.

డిఎస్‌సికి గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం, విజయనగరం ఉమ్మడి జిల్లాకు చెందిన 200 మంది గిరిజన అభ్యర్థులకు ఉపాధ్యాయ నియామక పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేశారని, కావున అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం ఐటిడిఎ పిఒ సేతు మాధవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణా కాలం 2 1/2 నుండి 3 నెలలు ఉంటుందన్నారు. ఈ శిక్షణ ఈనెల మూడో వారం మొదలవుతుందన్నారు. శిక్షణా కాలంలో వసతి, భోజన సౌకర్యం ఉచితంగా కల్పిస్తామన్నారు. బిబిడి/డిఇడితో పాటు టెట్ ఉత్తీర్ణులై ఉండాలని, వాటిలో వచ్చిన మార్కులు ఆధారంగా, టెట్లో వచ్చిన మార్కులు ఆధారంగా స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. 33.5 శాతం రిజర్వేషన్లు మహిళలకు వర్తిస్తుందని, కావున ఆసక్తి, అర్హత కలిగిన గిరిజన అభ్యర్థులు ఈనెల 12 సాయంత్రం 5గంటల్లోగా వారి దరఖాస్తులను బయోడేటా, సంబంధిత, విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రం నకలు, రేషన్ కార్డు నకలు, ఆధార్ కార్డు నకలు, 2 పాస్పోర్టు సైజ్ ఫొటోలను డిడి, గిరిజన సంక్షేమ శాఖ, పార్వతీపురం వారి కార్యాలయం లో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9441606731 / 7013196555 నెంబర్లకు సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం

ప్రజాశక్తి - సీతానగరం

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరీ కమిటీ సభ్యులు సవరపు రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన స్వగృహంలో మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా సుప్రీం తీర్పు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ తీర్పును అమలు చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో మాదిగలకు అన్యాయం జరగకుండా ఉండేందుకు ఈ తీర్పు ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

కురుపాం సిహెచ్‌సిని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లిగంగునాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులతో మాట్లాడి వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంలో కేవలం 30 పడకలు ఉండడంతో రోగులకు బెడ్ లు చాలక అనేక ఇబ్బందులకు గురవుతూ ఒక్కొక్క బెడ మీద ఇద్దరు, ముగ్గురు చొప్పున వైద్యం పొందుతున్నారని అన్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో గిరిజన గ్రామాల ప్రజలు ఎక్కువ మంది మలేరియా, టైఫాయిడ్, పాముకాటు తదితర వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రికి చేరి వైద్యం పొందుతూ బెడ్‌లు చాలక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కురుపాం పరిసర ప్రాంత గ్రామాలు కూడా రావాడ రామభద్రపురం, మాదలింగి పిహెచ్‌సి పరిధిలో ఉన్నాయని, దీనివల్ల ఆ గ్రామాల ప్రజలు అనారోగ్యంతో బాధపడితే మొదట ఆ పిహెచ్‌సికి వెళ్లి వైద్యం చేయించుకున్న తర్వాత రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. కావున కురుపాం పరిధిలో గ్రామాలన్నీ కూడా కురుపాం సిహెచ్‌సిలోకే మార్చాలని, ప్రతి సిహెచ్‌సి, పిహెచ్‌సిలో మలేరియా, టైఫాయిడ్ టెస్టింగ్‌కు కిట్లు, మందులు అందుబాటులో ఉండేలా



రోగులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు గంగునాయుడు

ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకొని ప్రజలకు వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని కోరారు. అలాగే నియోజవర్గ కేంద్రం కనుక తప్పనిసరిగా వంద పడకల ఆసుపత్రి ఉండాలని అలా అయితేనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్యమందుతుందని అన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి కురుపాం సిహెచ్‌సిని వంద పడకల ఆసుపత్రిగా మార్చి అవసరమైన భవనాలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీతంపేట : స్థానిక ఏరియా హాస్పిటల్ సిపిఎం బృందం పరిశీలన చేశారు. హాస్పిటల్ వరండాలో రోగులకు చికిత్స అందజేయడం బాధాకరమని సిపిఎం నాయకులు ఎం.తిరుపతిరావు, పి.సాంబయ్య, జె.శ్రీరాములు, ఎ.భాస్కరరావు అన్నారు. జిల్లా వైద్య అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కువ మంది గిరిజనులు అప్పులు చేసి ప్రైవేట్ వైద్యం కోసం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీతంపేట హాస్పిటల్లో 60 మంది రోగులు మలేరియాతో బాధపడుతున్నారని అన్నారు. జిల్లా మంత్రి హాస్పిటల్‌ను సందర్శించి, నిలిచిపోయే హాస్పిటల్ పనులు వెంటనే పునరుద్ధరణ చేసేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్‌లో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి నిధులతో గిరిజన భూముల అభివృద్ధి

ఈ ఏడాది 98 లక్షల పనిదినాలు కల్పన

'ప్రజాశక్తి'తో డ్వామా పీడీ కె.రామచంద్రరావు ముఖాముఖి



ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఉపాధిహామీ చట్టం నిధులతో గిరిజనులకు ప్రభుత్వ అందించిన ఆర్ఒఎఫ్ఆర్ పట్టాల భూములను అభివృద్ధి చేసి, వారికి ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా జల యజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేయనుందని, తద్వారా భూముల అభివృద్ధే కాకుండా వారి ఆదాయ వనరులు ఇతోధికంగా పెరిగి జీవితాల్లో పెను మార్పులు తీసుకువచ్చేందుకు దోహపడతాయని అన్నారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే....

2024 -25 ఏడాదికి గాను ఎన్ని పని దినాలు కల్పించారు?

ఈ ఏడాది 98 లక్షల పది దినాలను అమలు కల్పించాం. దీనిద్వారా 240 కోట్ల రూపాయలు వేతనదారులకు లబ్ధి చేకూర్చాం.

ఉద్యాన శాఖ ద్వారా చేపట్టనున్న పథకాలు ఏమిటి?

ఉద్యాన శాఖ ద్వారా మూడు ఎకరాలు కలిగిన లబ్ధిదారులను గుర్తించి వారి పొలాల్లో పామాయిల్ వేసేందుకు చర్యలు చేపట్టాం. జిల్లాలో 3వేల ఎకరాలు లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేయనున్నాం. ఎకరం భూమిలో కనీసం 58 పామాయిల్ మొక్కలను ఉచితంగా సరఫరా చేసి మూడేళ్ల పాటు వాటి నిర్వహణ, సంరక్షణకు ఏడాదికి సుమారు రూ.68వేలు లబ్ది కలిగేలా చర్యలు చేపడుతున్నాం.

పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేయనున్న పథకాలు ఏమిటి?

పశుసంవర్ధక శాఖ ద్వారా గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించి గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు వారికి షెడ్లను నిర్మించుకునేందుకు 90శాతం సబ్సిడీతో ప్రోత్సహిస్తున్నాం. కనీసం రెండు పశువులున్న వారికి లక్షా 15 వేల రూపాయలు, నాలుగు పశువులున్న వారికి రూ. 1,85,000, ఆరు పశువులు ఉన్నవారికి రూ.2,30,000 అందించనున్నాం. అలాగే కనీసం 20 మేకలు గానీ, గొర్రెలు గాని ఉన్నవారికి రూ.1,30,000, 50 మేకలు, గొర్రెలు ఉన్నవారికి 2,30,000 షెడ్లు నిర్మించుకునేందుకు, 30శాతం సబ్సిడీతో రుణాలు అందించనున్నాం. 100 కోళ్లు ఉన్నవారికి రూ.87,000, 200 కోళ్లు ఉన్నవారికి 1,32,000 డిఆర్‌డిఎ ద్వారా రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

గిరిజనుల భూ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?

ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా గిరిజనులకు అందించిన 78,000 ఎకరాల ఆర్ఒఎఫ్ఆర్ భూముల్లో జీడి, మామిడి కొబ్బరి, సీతాఫలం, పైనాపిల్ మొక్కలను 100శాతం సబ్సిడీతో అందించి వారి భూముల్లో వేసుకునేందుకు తద్వారా ఆదాయాన్ని పొందేందుకు చర్యలు చేపడుతున్నాం. సంరక్షణ కోసం ఉపాధి హామీ చట్టం ద్వారా వేతనదారులకు లబ్ధి చేకూర్చుతున్నాం.

కొండపోడు భూముల అభివృద్ధికి ఏం చేస్తారు?

కొండపోడు భూముల్లో రైతులకు అవగాహన కల్పించి కొండచీపుర్ల, పైనాపిల్, పసుపు సాగును ప్రోత్సహిస్తాం. అలాగే ఈ పంటల ఉత్పత్తిదారులను గుర్తించి వారికి వ్యవసాయఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేసి కుటీర పరిశ్రమలు డిఆర్‌డిఎ ద్వారా డ్వాక్రా సంఘాల సభ్యులకు కేటాయించేందుకు ప్రణాళికలు ప్రతిపాదించాం.

వైటిసిలకు మంచి రోజులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత మూడేళ్లుగా మూతపడిన యూత్ ట్రైనింగ్ సెంటర్లకు (వైటిసి) ప్రభుత్వ ప్రకటనతో మంచి రోజులు రానున్నాయి. నిరుద్యోగ గిరిజన యువత స్థానికంగా ఉండి వివిధ రంగాల్లో శిక్షణ పొందేందుకు 2017లో టిడిపి హయాంలో మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, పార్వతీపురం, సాలూరు మండలాల్లో వైటిసిలను ఏర్పాటు చేశారు. 2019 వరకు ఎంతో మంది నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు కంప్యూటర్, టైలరింగ్, డ్రెస్ మేకింగ్, డ్రైవింగ్ తదితర విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేవారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు రోజుకు రూ.160 చొప్పున సమకూర్చేవారు. రెండు నెలల కాలం శిక్షణ ఉండేది. శిక్షణ నిర్వాహకులకు రూ. 10వేలు చొప్పున చెల్లించేవారు. శిక్షణ కోసం కంప్యూటర్లు, కుట్టు మిషన్లు సమకూర్చారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు యువత హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లి స్థిరపడ్డారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లపాటు వైటిసిల నిర్వహణ సక్రమంగా జరిగిన కరోనా మహమ్మారి రావడంతో ఆ తర్వాత మూడేళ్లు శిక్షణ లేకుండా పోయింది. దీంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి లేకుండా పోయింది. దీంతో వైటిసి కేంద్రాల్లో శిక్షణ లేక వెలవెల బోతున్నాయి. వైటిసిల్లో పనిచేస్తున్న సిబ్బందికి నెలల తరబడి వేతనాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టిడిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రివర్గం చర్చల్లో వైటిసి, గిరిజన గర్భిణుల వసతి గృహాల పూర్వ వైభవానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించడంతో ఆ ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తం అవుతుంది. గిరి శిఖర ప్రాంతాల్లో గర్భిణీలకు సకాలంలో వైద్య సేవలందించేందుకు ఫీడర్ అంబులెన్సుల వినియోగం, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యం అందించేందుకు ఆరోగ్య కార్యకర్తల నియామకం తదితర అంశాలపై నిరుద్యోగ యువతకు ఉపాధి దొరుకుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలను దశలవారీగా అమలు జరిపితే గిరిజన యువతకు ఉపాధి శిక్షణ, గర్భిణీలకు మెరుగైన వైద్యం, విద్యార్థులకు నిరంతరం ఆరోగ్య పరీక్షలు అందించేందుకు వీలుంటుందని గిరిజన సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.



గుమ్మలక్ష్మీపురంలో గల యూత్ ట్రైనింగ్ సెంటర్

చెముడు విఒఎ మార్పు

గతంలో సస్పెండ్ చేసిన వారికే చోటు!

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని చెముడు పంచాయతీలో వెలుగులో పనిచేస్తున్న విఒఎను ఇటీవల మార్చారు. గతంలో పనిచేసిన బొంగు హేమలత స్థానంలో అదే గ్రామానికి చెందిన కరణం మీనా కుమారిని ఎంపిక చేశారు. దీనిపై హేమలత జిల్లా అధికారులకు ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఎపిఎం సన్నీ బాబును వివరణ కోరగా విఒఎ ఎంపిక విషయంలో తనకు ఎలాంటి పాత్ర లేదని, అంత స్థానిక విలేజ్ ఆర్గనైజేషన్ (విఒఎ) ఆధ్వర్యంలో జరుగుతుందని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా రాజకీయాల నేపథ్యంగానే ఈ మార్పు చోటు చేసిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ విధమైన లోపాల్లేకుండా ఎలా తొలగిస్తారన్న విషయాన్ని కూడా తాము అధికారుల దృష్టిలో పెట్టామని స్థానిక సర్పంచ్ బొంగు భీమ లింగేశ్వరరావు తెలిపారు. గతంలో సస్పెండ్‌కు గురైన వ్యక్తిని మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. విఒఎగా కొత్త వ్యక్తిని ఎంపిక చేయడం తన దృష్టికి రాలేదని దీనిపై సమగ్ర విచారణ జరపాలని అన్నారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు

ఘనంగా విజయరామరాజు 77వ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

రాష్ట్ర మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు 77వ పుట్టినరోజు వేడుకను చినమేరంగిలోని గల తన నివాసమందు ఘనంగా నిర్వహించారు. కురుపాం, పార్వతీపురం, బొబ్బిలి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, బోనెల విజయ చంద్ర, బేబినాయన కలిసి ఎన్నడూ లేని విధంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడం ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. విజయరామరాజు సతీమణి శత్రుచర్ల శశికలాదేవి కేకును కట్ చేసి ఆయనకు తినిపించారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గంలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



క్యారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

వెంకమ్మ సాగరంలో జలకళ

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేట పంచాయతీ పరిధి వెంకమ్మసాగరంలో జల కళకళలాడుతుంది. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా సాగునీరు సాగరంలోకి చేరడంతో ఆయకట్టుదారుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటివరకు చుక్క నీరు సాగరంలో లేనప్పటికీ వర్షం, కాలువ నీరు చేరడంతో నిండు కుండలా దర్శనమిస్తుంది. వెంకమ్మ సాగరం ఆయకట్టు కింద 300 ఎకరాల పైబడి సాగవుతుంది. సాగరంలో నీరు నిలకడగా ఉండడంతో ఈ ఏడాది రెండు పంటలు సాగు చేసుకోవచ్చని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న నోబెల్ వాకర్స్ క్లబ్ సభ్యులు

స్నేహమే సేవాభావానికి నిలయం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్నేహపూర్వక మనస్తత్వం కలిగిన వారే సేవా భావాన్ని కలిగి ఉంటారని నోబెల్ వాకర్స్ క్లబ్ గవర్నర్1 జె నారాయణస్వామి, మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పోల సత్యనారాయణ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న వారు ముందుగా ఒకరికొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కొమిరి కృష్ణమూర్తిని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి సేవలు గురించి వివరిస్తూ తన నెల జీవితంలో రూ.10వేలు ప్రతినెలా సేవా కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తూ దళిత, గిరిజన కాలనీల్లో పేదలకు, వృద్ధులకు, మహిళలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు సమకూర్చడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ నోబుల్ వాకర్స్ క్లబ్ గవర్నర్ ఇండుపూరు గున్నేష్, మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు మంత్రి రవికుమార్, గౌరవ సలహాదారు నాగు కాకిముక్కల, ఉపాధ్యక్షులు వి.చిన్నారావు కార్యదర్శి ఉమామహేశ్వరరావు, కోశాధికారి మీసాల శ్రీధర్, సభ్యులు మార్కండేయులు, సోమేశ్వరరావు, ఆర్.సత్యనారాయణ, మహాపాత్రుని శ్రీనివాసరావు, ఎస్.గౌరీశంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



మావుడి ఆశ్రమ పాఠశాలలో ఆర్ఒ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండలంలోని మావుడి, మామిడిపల్లి ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో రక్షిత మంచినీటి సరఫరా చేసే ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదని చెప్పారు. వాటిని మరమ్మతు చేయాలని కోరారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్. ఆయన వెంట ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాద్రి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో నిరుపేద రోగులకు పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ వి.గణేశ్వరరావు రోగులను తనిఖీ చేసి మందులు అందజేశారు. ప్రతివారం లయన్స్ క్లబ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పేద రోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. క్లబ్ సభ్యులు సొంత నిధులతో మందులు కొనుగోలు చేసి 50 మంది రోగులకు పంపిణీ చేస్తున్నారు. క్లబ్ సభ్యులైన డాక్టర్ గణేశ్వరరావు, డాక్టర్ అరిశెట్టి మోహన్‌రావు, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ పెంట శ్రీనివాసరావు ఒక్కో వారం ఒక్కొక్కరు రోగులకు తనిఖీలు చేస్తారు. ఏడాది కాలంగా క్లబ్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ ఇండుపూరి నారాయణ రావు, మాజీ చైర్మన్ కర్రి వెంకట్రావు, స్కూల్ కరస్పాండెంట్ సిబి శేఖర్ చెప్పారు. భవిష్యతులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహించే యోచనలో వున్నట్టు వారు తెలిపారు.



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గణేశ్వరరావు



నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వాలంటీర్లు

వాలంటీర్లను తొలగింపు నోటీసులు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - పాలకొండ

వాలంటీర్లను సర్వీసుల నుంచి తొలగిస్తూ జారీ చేసిన నోటీసు తక్షణమే పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఎపి సచివాలయ గ్రామ, వార్డు వాలంటరీ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఆదివారం జరిగిన సమావేశంలో రమణారావు మాట్లాడారు. పుర పరిపాలనశాఖ నగరపంచాయతీ కార్యాలయం పాలకొండ పరిధిలో వీవర్స్ కాలనీ వార్డు సచివాలయంలో ప్రస్తుతం పని చేస్తున్న 11 మంది, శ్రీరామ కళామందిరం వార్డు సచివాలయంలో ఐదుగురు వాలంటీర్లను సర్వీసుల నుంచి తొలగిస్తూ ఈనెల 3న నోటీసులు వాట్సప్ ద్వారా పంపించడాన్ని తీవ్రంగా ఖండించారు. వీవర్స్ కాలనీ వార్డు సచివాలయం అడ్మిన్ సెక్రెటరీ సమాచారం మేరకు తొలగిస్తున్నట్టు నోటీసు ఇవ్వడం కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని, పాలకొండ నగర పంచాయతీలో 17 మంది వాలంటీర్లు రాజీనామాలు చేయలేదని, వీరు విధి నిర్వహణలో ఉన్నారని అన్నారు. వీవర్స్ కాలనీ అడ్మిన్ సెక్రెటరీ వాలంటీర్లు గైర్హాజరయ్యారన్న నెపంతో తొలగించడం సరైంది కాదని, రాజకీయ ఒత్తిడికి అందరూ రాజీనామా చేసిన 17 మంది రాజీనామాలు చేయకుండా విధి నిర్వహణలో ఉంటే వారికి వేతనాలు కూడా చెల్లించకుండా నగర పంచాయతీ కార్యాలయం నిర్లక్ష్యం వహించడం సరైంది కాదని, తక్షణమే వీవర్స్ కాలనీ వార్డు సచివాలయంలో 11మంది శ్రీరామ కళామందిరం సచివాలయం 5 మంది వాలంటీర్‌లకు జారీ చేసిన నోటీసులను ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు.



ఎస్ఐతో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

రక్షణ గోడ నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల కేంద్రానికి సమీపానున్న చిదిమి జంక్షన్ ప్రధాన మలుపును ఆదివారం పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు పరిశీలించారు. గత నెల 21న ఇదే మలుపు వద్ద వంతెనకు ఒకవైపు ఉన్న రక్షణ గోడను లారీ ఢీకొనడం పాఠకులకు తెలిసిందే. అదే నెల 23న ప్రమాదం జరిగిన స్థలాన్ని డిఎస్‌పి పరిశీలించి లారీ కారణంగా కూలిపోయిన రక్షణ గోడను నిర్మించేందుకు ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడారు. గోడ కట్టేందుకు నిధులు లేనందున పనులు చేయలేమని ఆర్అండ్‌బి అధికారులు డిఎస్‌పికి వివరించారు. తామే భరించుకొని రక్షణ గోడ కట్టేందుకు చర్యలు చేపట్టినట్లు డిఎస్‌పి తెలిపారు. ప్రమాదం జరిగిన చోట మరిన్ని ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు స్టాప్ బోర్డులు, డ్రమ్ములు, మలుపు వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయము లేకుండా పాలకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం చంద్రమౌళి, స్థానిక ఎస్సై ఎస్కే ఫక్రుద్దీన్ కు అభినందన తెలిపారు.

గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తున్న సర్కారు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల విద్యారంగంలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని, వాటన్నింటినీ పరిష్కరించి విద్యారంగాన్ని గాడిలో పెడతామని ప్రకటించిన ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ అవే తప్పిదాలను కొనసాగించడాన్ని ఖండిస్తున్నట్టు ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా రంగాన్ని తీవ్రంగా నష్టం చేసిన 117 జీవో రద్దు చేస్తామని ప్రకటించి కూడా ఇప్పటి వరకు ఆ ప్రయత్నం లేదు, సరి కదా ఇప్పుడు తాజాగా జరగనున్న పని సర్దుబాటు ఆ జీవో ప్రాప్తికి రాష్ట్రస్థాయిలో కమిషనరేట్ నుంచి జరపాలని నిర్ణయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గతంలో జరిపిన సర్దుబాటు వల్ల ఉపాధ్యాయులకు ఇబ్బంది తలెత్తితే జిల్లాస్థాయి అధికారులు పరిష్కరించేవారని, ఇప్పుడు ఆ అవకాశం కూడా ఇవ్వకుండా కమిషనరేట్ నుంచి నిర్వహించడం సరైన విధానం కాదని అన్నారు. అంతేకాక 10 మంది విద్యార్థుల లోపు ఉన్న పాఠశాలలను మూసివేసే ప్రయత్నం కూడా చేస్తున్నట్టు తెలుస్తోందని, ఇది విద్యారంగానికి, పాఠశాలల మనుగడకు తీవ్ర హాని చేసే నిర్ణయమని, కావున తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉండేలా, అవి సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు వేలాది మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేశారని, ప్రస్తుతం అనేక ఉన్నత పాఠశాలల్లో ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులతో కొనసాగుతున్నాయని అన్నారు. కావున ఆ పాఠశాలల్లోని విద్యార్థులకు న్యాయం జరగాలంటే వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా ఉపాధ్యాయ సంఘాల సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

అభ్యుదయ విద్యాసంస్థల అధినేతకు మాతృవియోగం

ప్రజాశక్తి- బొబ్బిలి



అభ్యుదయ విద్యా సంస్థల అధినేత మర్రాపు కూర్మి నాయుడు (నాని)కు మాతృ వియోగం జరిగింది. నాని తల్లి మర్రాపు మహాలక్ష్మి శనివారం రాత్రి మరణించారు. బొబ్బిలి ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యను అందించేందుకు మహాలక్ష్మి భర్త మర్రాపు సత్యనారాయణ అభ్యుదయ పాఠశాలను స్థాపించారు. ఆయన 2008లో మరణించారు. అప్పటి నుంచి పాఠశాల కరస్పాండెంట్ గా కుమారుడు మర్రాపు కూర్మినాయుడు, ప్రిన్సిపాల్ గా కోడలు చింతా శారద వ్యవహరిస్తున్నారు. మహాలక్ష్మి మరణించడంతో పట్టణ ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే బడ్జెట్‌ను వ్యతిరేకించండి

ప్రజాశక్తి - కొమరాడ

దేశంలో వ్యవసాయ రంగానికి తీవ్రంగా నష్టం చేసేలా బడ్జెట్ ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిరా అన్నారు. ఆదివారం కొమరాడలో కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా నిరసన చేపట్టారు. అనంతరం ఇందిర మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం వ్యవసాయానికి తీవ్రంగా నష్టం చేసే బడ్జెట్‌గా ప్రవేశపెట్టిందని విమర్శించారు. సాగునీటి వనరులకు గానీ, రాష్ట్ర ప్రత్యేక హోదాకు గానీ, విభజన హామీలకు సంబంధించిన ఎటువంటి సంబంధం లేని బడ్జెట్‌గా ఉందని విమర్శించారు. కావున బడ్జెట్‌ను రైతులంతా తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, ప్రజాసంఘాల నాయకులు ఎ.ఉపేంద్ర, జి.జగన్నాథం, రెడ్డి శివున్నాయుడు, వెంకటేష్, బోడియ సుందరావు, శ్రీకాంత్, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఐటిడిఎ ద్వారా గిరిజన విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ ద్వారా ఇతర విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో డిఎస్సీ శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కమిటీ నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి తీసుకున్న ఉచిత డిఎస్సీ కోచింగ్ నిర్ణయం ఎంతోమంది పేద అభ్యర్థులకు ఉపయోగపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు..

కాలువలో పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి - వీరఘట్టం

తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ నుంచి మొదటి కెనాల్ ద్వారా కొట్టుగుమ్మడ, గడగమ్మ శివారు భూములకు సాగునీరు రాకపోవడంతో మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం జెసిబి ద్వారా కాలువలో పిచ్చి మొక్కలు తొలగించారు. కడకల్లా నుంచి నడిమికెల్ల, విక్రంపురం, చిట్టిపూడివలస, నడుకూరు మీదుగా తమ గ్రామాలకు కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోవడం వల్ల సాగునీరు కిందకు రావడంలేదని అన్నారు. ఈ ప్రాంత రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని జెసిబి ద్వారా పిచ్చి మొక్కలు తొలగిస్తున్నట్లు ఉదయభాస్కర్ తెలిపారు. గత నెల 13న సాగునీరు విడుదల చేసినప్పటికీ ఇంతవరకు తమకు సాగునీరు చేరకపోవడంతో పిచ్చి మొక్కలు తొలగిస్తే కాస్తేనే నీరు వస్తాదన్న ఆశతో పూడికలు పూడికలు తొలగిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాగునీరు రాకపోవడంతో ఈ ప్రాంతంలో ఎక్కడా వరి నాట్లు పడలేదు. ప్రతి ఏటా సాగునీటి కోసం అవస్థలు తప్పటం లేదు. డొంక తీస్తే మొత్తం కదిలినట్లు కాలువలో పూడికలు తొలగిస్తే గాని సాగునీరు రావటం లేదని రైతుల వాపోతున్నారు.

త్రీమెన్ కమిటీలో మాజీ మంత్రికి చోటు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావుకు చోటు దక్కింది. విజయవాడలోని ఒక హోటల్లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ బాడి ప్రత్యేక సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రస్తుత అధ్యక్ష శరత్ చంద్రారెడ్డి, కార్యదర్శి గోపినాథ్‌తో పాటు ఇతర సభ్యులు రాజీనామాలు సమర్పించారు. వెంటనే త్రీమెన్ కమీటీని అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సంతకాలకే కాకుండా తమదైన ముద్ర ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక సంస్థల పాలనలో మహిళ పాత్ర పెరగాలంటే సంతకాలకే పరిమితం కాకుండా తమదైన ముద్ర ఉండేలా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ కల్యాణమండపంలో నియోజకవర్గంలోని మహిళతో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఆయన భార్య అనూష ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల్లో పాలనలో పేరు మహిళలది, పెత్తనం పురుషులది అని అన్నారు. కావున మార్పు తీసుకురావాల్సిన అవసరం మన నియోజకవర్గ నుండే మొదలు పెట్టాలన్నారు. సంతకాలు పెట్టడానికి పరిమితం కాకుండా పాలనలోనూ సమస్యలపై అవగాహన, వాటిని పరిష్కరించడంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ చూపి స్థానిక ప్రజల మన్ననలు అందుకోవాలని అన్నారు. రానున్న రోజుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు. అని రంగాల్లో రాణిస్తున్న మహిళలు పరిపాలనలోనూ తమదైన ముద్ర వేయాల్సిన అవసరం ఉందన్నారు. తన విజయంలో మహిళల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. అనూష మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయంలో మహిళ పాత్ర చాలా కీలకమన్నారు. ప్రతి విషయంలోనూ తన వెన్నంటే ఉంటూ విజయ చంద్ర గెలుపునకు మహిళలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మహిళలు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసుపత్రి స్థాయి పెరిగి, నిధులున్నా భవన నిర్మాణాలు, ఆధునీకరణ పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో రోగులు, వారి కుటుంబ సభ్యులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. జిల్లా ఆసుపత్రిలో ఉన్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రంజిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు, రిఫరల్ కేసులు తగ్గించేందుకు పాలకులు, అధికారులు కృషి చేయాలని కోరారు. జిల్లా కేంద్రంతో సహా పలు ప్రాంతాల్లో కుక్కలు చేస్తున్న దాడులపై అధికారులు స్పందించాలని కోరారు. సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అలాగే కుక్కల దాడిలో మనుషుల ప్రాణాలు పోతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.



శ్లాబ్ పెచ్చులూడిపోయిన జిసిసి కార్యాలయం

శిథిలావస్థలో జిసిసి కార్యాలయం

భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు


ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక గిరిజన సహకార సంస్థ బ్రాంచి కార్యాలయం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలం కావడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనం పైభాగం నుంచి నీరు కారుతుంది. దీంతో గోడలు చెమ్మలతో చెట్లు వేళ్లు రావడంతో బీటలు వారుతున్నాయి. మరోవైపు పైకప్పు కింది భాగం శ్లాబు పెచ్చులు ఊడుతున్నాయి. 50 ఏళ్ల కిందట నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో దాని సమీపంలోనే ఏడాది క్రిందట కొత్త భవనం నిర్మించారు. అయితే మేనేజర్‌తో పాటు అకౌంటెంట్, సీనియర్ అసిస్టెంట్ సేల్స్ మెన్లు, అటెండర్లు, సిబ్బంది విధులకు సరిపడా గదులు లేకపోవడంతో దాన్ని ప్రారంభించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సిబ్బంది విధులకు ఆటంకం లేకుండా అదనపు భవనం నిర్మించి ఉద్యోగులకు రక్షణ కల్పించాలని జిసిసి అభివృద్ధికి సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీరు కలుషితమవుతున్నా పట్టించుకోరా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని ప్రధాన రహదారిలో గల ప్రధాన పోస్ట్ ఆఫీసు జంక్షన్ వద్ద, స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి జంక్షన్ వద్ద, జిల్లా కలక్టరేట్ కార్యాలయ ప్రాంతంలో, గౌడవీధి జంక్షన్ వద్ద పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైపులైనుకు లీకులు ఏర్పడి పంపింగ్ జరుగుతున్న సమయంలో రహదారిపైకి తాగునీరు వృథాగా పోయి కలుషితమవుతోంది. దీంతోపాటు జగన్నాథపురం వాటర్ ట్యాంకు ఎదురుగా ఉన్న పైపు లైన్ వాల్, బంధం వారి వీధి, చివర పెద్ద మాదిగ వీధి, కూడలి వద్ద ఉన్న పైప్ లైన్ వాల్, బెలగాంలో చర్చి వీధిలో ఉన్న పైప్‌లైన్ వాల్ ద్వారా కుళాయిలకు తాగు నీరు సరఫరా చేసేటప్పుడు నీరు బయటకు పొంగి పొర్లడం వల్ల మురికి నీరు కలుషితమవుతుంది. ఈ లీకుల కారణంగా పట్టణ ప్రజల ఆరోగ్యానికి భద్రత లేకుండాపోతుందనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ముఖ్యంగా పట్టణంలో మలేరియా, డయేరియా జ్వరాలతో పాటు పొడి బారిన దగ్గులతో కూడిన కేసులు అధికంగా ఉన్నాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ ఇంజనీరింగు శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



గౌడవీధి జంక్షన్‌లో లీకైపోతూ వృథాగా పోతున్న తాగునీరు